క్లుప్తంగా

'ప్రజా సమస్యల పరిష్కార వేదిక'కు దరఖాస్తులు నిల్

పగిడ్యాల: ప్రజా సమస్యల పరిష్కారం కోసం గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రతి సోమవారం నిర్వహిస్తూ వచ్చిన స్పందన కార్యక్రమం పేరును టీడీపీ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కార వేదికగా మార్చినట్లు తహసీల్దార్ నాగేశ్వరరావు తెలిపారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమానికి మండల స్థాయిలోని అన్ని శాఖల అధికారులు హాజరయ్యారు. అయితే ప్రజల నుంచి ఎలాంటి వినతులు రాలేదని ఆయన వెల్లడించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కవిరాజు, ఎంఈఓ సుభాన్, ఏఓ విజయ్‌జ్యోతుకుమార్, ఈఓఆర్డీ నాగేంద్రయ్య, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ శేషమ్మ, ఏఈలు వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

శివాలయంలో పూజలు



అలంకరణలో మహాశివుడు

ఆత్మకూరు: పట్టణంలోని శివాలయంలో సోమవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేకువజామున మహాశివుడికి పంచామృతాభిషేకాలు, విశేష పూజలు జరిపించారు. పార్వతీమాతకు కుంకుమార్చనలు, అభిషేకాలను నిర్వహించి, ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనభాగ్యం కల్పించారు. ఉదయం భక్తులు పెద్ద సంఖ్యలో స్వామివారి పంచామృతాభిషేకంలో పాల్గొన్నారు. సాయంత్రం స్వామివారికి పల్లకీసేవ నిర్వహించి, భక్తులకు అన్నదాన కార్యక్రమాలను నిర్వహించినట్లు ఆలయ కమిటీ సభ్యులు ఆర్.కె.శేషఫణి తెలిపారు.

ముస్లిం కాలనీలో నీటి ఎద్దడి



మినీ ట్యాంక్ వద్ద నీళ్ల కోసం ముస్లిం కాలనీ మహిళల పాట్లు

పగిడ్యాల: మండలంలోని పడమర ప్రాతకోట ముస్లిం కాలనీలో తాగునీటి ఎద్దడి నెలకొనడంతో కాలనీవాసులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. కొద్ది రోజులుగా వ్యక్తిగత కుళాయి కనెక్షన్‌లకు, మిని ట్యాంక్‌లు, జీఎల్ఎస్‌ఆర్ ట్యాంక్‌లకు నీటి సరఫరా రెండు, మూడు రోజులకోసారి చేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. దీనికి తోడు కొందరు మోటార్లు వేసుకుని నీటి చౌర్యానికి పాల్పడుతున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని ఆరోపించారు. బక్రీద్ పండుగ పూట కూడా నీటి కోసం అల్లాడిపోయామని అయినా ఎవరూ స్పందించలేదని వాపోయారు. ఇప్పటికైనా మండల స్థాయి అధికారులు స్పందించి కాలనీలో ఏర్పడిన తాగునీటి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపాలని వారు కోరుతున్నారు.

29న కౌన్సిల్ సాధారణ సమావేశం

నందికొట్కూరు: ఈ నెల 29వ తేదీన మున్సిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం నిర్వహిస్తున్నట్లు మున్సిపల్ కమిషనర్ సుధాకర్ రెడ్డి సోమవారం తెలిపారు. శనివారం ఉదయం 11 గంటలకు మున్సిపల్ కార్యాలయంలో సమావేశం జరుగుతుందని చెప్పారు. అధికారులు, ప్రజా ప్రతినిధులు తప్పని సరిగా హాజరు కావాలని కోరారు.

కౌలు కార్డులకు దరఖాస్తు చేసుకోండి

కొత్తపల్లి: ఇతరుల పొలాలను కౌలుకు తీసుకొని సాగుచేసుకునే రైతులు కౌలు గుర్తింపు కార్డులు పొందేందుకు దరఖాస్తు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి కె.మహేష్ సోమవారం సూచించారు. ఖరీఫ్ సీజన్‌కు ఇతర రైతుల నుంచి పొలాన్ని కౌలుకు తీసుకొని సాగుచేసుకునే రైతులు తప్పకుండా కౌలు కార్డును పొందాలని సూచించారు. ప్రభుత్వ పథకాలకు అర్హులు కావాలంటే కౌలుకార్డు తప్పనిసరి అని వివరించారు. గ్రామాలలోని దేవాదాయ శాఖ భూములు, వక్ఫ్‌బోర్డు భూములు, అలాగే ఇతర రైతుల పొలాలను కౌలుకు వేసుకునే రైతులకు కౌతుపత్రం ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. రైతులు సరైన ధ్రువపత్రాలతో రైతు భరోసా కేంద్రాల్లో సంప్రదించాలని సూచించారు.

ఆరోగ్యంపై అశ్రద్ధ వద్దు

పాములపాడు: ఆరోగ్యం పట్ల ప్రజలు అశ్రద్ధ వహించొద్దని డాక్టర్ నాగలక్ష్మి దేవి అన్నారు. సోమవారం స్థానిక పీహెచ్‌సీలో విలేకరులతో మాట్లాడుతూ వాతావరణ పరిస్థితుల వల్ల, పరిసరాల పారిశుద్ధ్యం లోపించడం, కలుషిత ఆహార పదార్థాల కారణంగా అనారోగ్య పాలవుతున్నారన్నారు. ఏ మాత్రం వాంతులు, విరేచనాలు, నలతగా ఉన్నా వెంటనే డాక్టర్‌ను సంప్రదించాలని సూచించారు. నిర్లక్ష్యం చేస్తే ప్రమాదమన్నారు. వేడిగా ఉన్న ఆహార పదార్థాలను భుజించాలని సూచించారు. ముఖ్యంగా మాంసాహారం తినేవారు మరీ జాగ్రత్తలు పాటించాలని వెల్లడించారు.

కుళ్లిన కూరగాయలతో వంటకాలు

- ప్రభుత్వ హాస్టళ్లను తనిఖీ చేసిన అధికారులు
- ఒక్క రికార్డూ సక్రమంగా ఉంటే ఒట్టు
- భోజనంలో మెనూ పాటించని వైనం
- విద్యార్థులు తక్కువగా ఉన్నా రికార్డుల్లో ఎక్కువ నమోదు
- మోడల్, కస్తూర్బా, గురుకుల హాస్టళ్లల్లో నమోదు చేయని రికార్డులు



కొత్తపల్లి కేజీబీవీ పాఠశాలలో విద్యార్థినులతో సమస్యలపై ఆరా తీస్తున్న తహసీల్దార్ తిరుపతయ్య





జూపాడుబంగ్లా మోడల్ స్కూల్‌లో కుళ్లిన టమాట, కూరగాయలు

జూపాడుబంగ్లా: జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు ఆదేశాల మేరకు సోమవారం తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్, డిప్యూటీ తహసీల్దార్లు చంద్రశేఖర్, నాగన్న, ఆర్ఐ శ్రీరంగారెడ్డి జూపాడుబంగ్లాలోని కస్తూర్బా, మోడల్, గురుకులం, ఎస్సీ బాలికల హాస్టళ్లను తనిఖీ చేశారు. విచారణలో పలు ఆసక్తికరమైన విషయాలు వెల్లడయ్యాయి. మొదట కస్తూర్బా పాఠశాలలో తనిఖీ చేయగా క్యాజువల్‌లీవు, క్యాష్‌బుక్, మూవ్‌మెంటు రికార్డులు ఇప్పటి దాకా నమోదు చేయలేదు. 2023 ఫిబ్రవరి నాటికి రికార్డుల నమోదు నిలిపివేయగా 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇప్పటిదాకా రికార్డులు నమోదు చేసిన దాఖలాల్లేవు. పాఠశాలలో 273 మంది విద్యార్థులుండగా 200 మంది హాజరైనట్లు ఎస్‌ఓ యశోద తెలిపారు. మెనూ సక్రమంగా అమలుకావడం లేదని అధికారుల విచారణలో వెల్లడైంది. పాఠశాలలో సైన్స్‌ల్యాబ్, ప్రహరీ, లాయ్‌లెట్లు, బాత్‌రూం, డార్మిటరీ లేవని ఎస్‌ఓ అధికారులకు వివరించారు. వారి విచారణలో వెల్లడైన విషయాలను అధికారులు నమోదు చేసుకున్నారు.

మోడల్ పాఠశాల హాస్టల్ అంతా అస్తవ్యస్తం

మోడల్ పాఠశాల హాస్టల్ నిర్వహణ అంతా అస్తవ్యస్తంగా ఉన్నట్లు విచారణలో వెల్లడైనట్లు తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. హాస్టల్లో 100మందికి సరిపడా వసతి సౌకర్యాలుండగా పరిసరాలు, టాయ్‌లెట్లు సక్రమంగా లేవన్నారు. మోడల్‌పాఠశాల ఈనెల 13న ప్రారంభం కాగా హాస్టల్ ఈనెల 19న ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ రమేష్, వార్డెన్ లలితమ్మ తెలిపారు. ఈనెల 19న ముగ్గురు పిల్లలు వచ్చారని ప్రిన్సిపాల్, 15 మంది పిల్లలు వచ్చారని వార్డెన్ పేర్కొనగా.. 20 మంది పిల్లలకు భోజనాలు వండిపెట్టినట్లు రోజువారీ సరుకుల జారీ పట్టిక రికార్డులో నమోదు చేశారు. అయితే తహసీల్దార్‌కు ఈనెల 21న సరుకులు కొనుగోలు చేసినట్లు రికార్డులు చూపించారు. అలాగే సోమవారం హాస్టల్లో 25 మంది ఉన్నట్లు వార్డెన్ తెలుపగా రోజువారీ సరుకుల జారీ పట్టిక రికార్డులో 30 మందికి భోజనాలు వండిపెట్టినట్లు నమోదు చేశారు. హాస్టల్లో విద్యార్థులు 30 మంది ఉంటేవారికి సరిపడా కూరగాయల్లేకపోవడం గమనార్హం. మూవ్‌మెంటు, క్యాష్‌బుక్, సీఎల్ రిజిష్టర్, స్టాక్ కొనుగోలు వంటి రికార్డులు తహసీల్దార్‌కు చూపించలేదు. హాస్టల్‌లో వంద మంది విద్యార్థులకు సరిపడా బెడ్‌షట్లు, దుప్పట్లు ఉన్నాయని పేర్కొన్న వార్డెన్ విద్యార్థులకు ఇప్పటిదాకా ఇచ్చిన దాఖలాల్లేవు. అలాగే పాలు, ఎగ్స్, బియ్యం తదితర నిత్యావసర వస్తువులకు సంబంధించిన రికార్డులు కూడా చూపించలేదు. ఎగ్స్ తహసీల్దార్ స్వయంగా లెక్కించగా తక్కువగా వచ్చాయి. అలాగే గురుకుల పాఠశాలలో కూడా హాస్టల్ నిర్వహణకు సంబంధించిన రికార్డులు తహసీల్దార్‌కు చూపించలేదు. హాస్టళ్ల తనిఖీలో తన విచారణలో వెల్లడైన విషయాలను జిల్లా కలెక్టర్ శ్రీనివాసులకు నివేదించనున్నట్లు తహసీల్దార్ బాబూరాజేంద్రప్రసాద్ తెలిపారు. ఈయన వెంట డీటీ లు నాగన్న, చంద్రశేఖర్, ఆర్ఐ శ్రీరంగారెడ్డి పాల్గొన్నారు.

పాఠశాలలు, సంక్షేమ గృహాల ఆకస్మిక తనిఖీ

కొత్తపల్లి: మండల పరిధిలోని పాలెచెరువు గూడెం ఆశ్రమ పాఠశాల, మండల కేంద్రంలోని కస్తూర్బాగాంధీ బాలికల పాఠశాల, స్థానిక బీసీ బాలుర వసతి గృహాలను తహసీల్దార్ తిరుపతయ్య సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ముందుగా విద్యార్థుల సంఖ్య, హాజరుపట్టీ, ఉపాధ్యాయుల హాజరు పట్టీ, మధ్యాహ్న భోజన పథకం అమలును తనిఖీ చేశారు. విద్యార్థులతో ముఖాముఖీ మాట్లాడి సమస్యలు తెలుసుకున్నారు. వీరివెంట వీఆర్వోలు చంద్రశేఖర్, వేణు, లింగేశ్వర్, జూనియర్ అసిస్టెంట్ సాయికుమార్ రెడ్డి, ఉపాధ్యాయులు ఉన్నారు.



గురుకుల పాఠశాలలో వండిన అన్నాన్ని పరిశీలిస్తున్న తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్

మెనూ ప్రకారం భోజనాలు పెట్టాలి



విద్యార్థినులతో సమస్యలు తెలుసుకుంటున్న తహసీల్దార్ సుమతి

మహానంది: బండిఆత్మకూరు కస్తూర్బా బాలికల పాఠశాలను బండి ఆత్మకూరు తహసీల్దార్ సుమతి సోమవారం తనిఖీ చేశారు. పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం వంటగదిని పరిశీలించి మెనూ ప్రకారం విద్యార్థులకు భోజనాలు పెడుతున్నారా లేదా అని ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ విద్యార్థులకు అందించే మెనూ విషయంలో నిర్లక్ష్యంగా ఉండొద్దని, నాణ్యతగా రుచికరంగా భోజన వసతి ఏర్పాటు చేయాలని ప్రిన్సిపాల్ ద్రాక్షాయనికి సూచించారు. కార్యక్రమంలో వీఆర్వో యేసు పాదం, పాఠశాల సిబ్బంది సుమలత తదితరులు పాల్గొన్నారు.

జోరువాన

మహానంది: మహానంది పుణ్యక్షేత్రం పరిసరాల్లో సోమవారం రాత్రి ఓ మోస్తరు వర్షం కురిసింది. సమీప గ్రామాలతో పాటు మహానంది పుణ్యక్షేత్రం ఆవరణలో జోరుగా వర్షం కురవడంతో వాతావరణం ఒకసారిగా చల్లబడింది. దీంతో స్థానికులు భక్తులు హాయిగా వాతావరణాన్ని ఆస్వాదించారు.

ఉచిత వైద్య శిబిరాలు పేదలకు వరం



వైద్య శిబిరాన్ని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే జయసూర్య

నందికొట్కూరు: ఉచిత వైద్య శిబిరాలు పేద రోగులకు వరమని ఎమ్మెల్యే జయసూర్య అన్నారు. సోమవారం పట్టణంలోని వేళాంగణి మాత చర్చి ప్రాంగణంలో ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఎమ్మెల్యే, టీడీపీ నాయకులు మాండ్ర శివానందరెడ్డి జ్యోతి వెలిగించి ప్రారంభించారు. ఆర్‌సీఎం చర్చి ఫాదర్ కేడీ జోసెపు, బాల ఏసు ఆధ్వర్యంలో గ్యాస్ట్రబుల్, న్యూరాలజీ, మెదడు, వెన్నుపూస, నడుము, నరాల బలహీనత, పక్షవాతం, స్ట్రోక్, వణుకుడు, రోగములు, ఫిట్స్, మూర్ఛ పంటి, చిగురు, షుగర్ సమస్యలున్న 800 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పేదలకు ఉచిత వైద్యం అందించేందుకు కర్నూలు ఆర్‌ఆర్ హాస్పిటల్ బృందం ముందుకు రావడం హర్షించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో వైద్యులు రాహుల్, రోహిత్, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రారెడ్డి, ముర్తుజావలి, ఏసేపు, ఖాజా, ధర్మరాజు, తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ భవిష్యత్తు



విద్యార్థికి నగదు అందజేస్తున్న ఎంఈఓ సురేష్, ఆర్మీ సైనికుడు తమ్మినేని అమర్‌నాథ్

ఆత్మకూరు: విద్యార్థులు కృషి, పట్టుదల, క్రమశిక్షణతో ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని ఆత్మకూరు ఎంఈఓ సురేష్ అన్నారు. సోమవారం వెంకటాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2024 మార్చిలో 10వ తరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పాఠశాల పూర్వ విద్యార్థి, ఇండియన్ ఆర్మీ సైనికుడు తమ్మినేని అమర్‌నాథ్ నగదు ప్రోత్సాహకాలను ఎంఈఓ చేతులమీదుగా అందజేశారు. పదిలో అధిక మార్కులు సాధించిన విద్యార్థి ఇ.తేజచరణ్‌కు రూ.10 వేలు, రెండో స్థానంలో నిలిచిన యస్.ముస్కాన్ తాహసిన్‌కు రూ.8 వేలు, మూడో స్థానంలో నిలిచిన యస్.అయిషాకు రూ.5 వేలు అందించారు. అనంతరం ఇండియన్ ఆర్మీ సైనికుడిని ఉపాధ్యాయులు శాలువాలో సన్మానించారు. కార్యక్రమంలో వెంకటాపురం జెడ్పీ పాఠశాల ఇన్‌చార్జ్ హెచ్ఎం జవహర్‌నాయక్, గాలిబ్‌అహ్మద్, దాదాపీరా, వలిబాషా, దాసు, శోభన్‌బాబు, నాయక్, రాజానాయక్ తదితరులు పాల్గొన్నారు.

పోటాపోటీగా ఆలయ భూముల వేలాలు



వేలాలు నిర్వహిస్తున్న అధికారులు

మహానంది: బండిఆత్మకూరు మండలం అయ్యవారి కోడూరు గ్రామంలో కొలువైన శ్రీ రామేశ్వర స్వామి ఆలయానికి చెందిన 15.99 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న భూములకు సోమవారం బహిరంగ వేలం పాట నిర్వహించారు. భూములకు గతేడాది రూ.3,11,000 రాగా ఈ ఏడాది రూ.3,68,000 వచ్చింది. గతేడాది కంటే రూ. 57 వేలు అదనంగా ఆదాయం వచ్చింది. అలాగే శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి ఆలయానికి చెందిన 10.56 ఎకరాల భూముల ద్వారా రూ.2,65,000 రాగా గతేడాది కంటే అదనంగా రూ.1,14,000 పెరిగింది. 32.56 ఎకరాలకు వేలం వాయిదా పడినట్లు గ్రూపు దేవాలయాల ఇన్‌స్పెక్టర్ శశికుమార్ తెలిపారు.





రంగు రంగుల సీతాకోక చిలుకలు



వరుసగా కురుస్తున్న వర్షాలతో నల్లమల పచ్చటి అందాలు అబ్బురపరుస్తున్నాయి. పచ్చటి చెట్లు, పక్షుల కీలకిలారావాలు ప్రకృతి ప్రేమికుల మదిని దోచేస్తున్నాయి. ఇంతటి అందాలకు తోడు కొత్త బంగారు లోకంలో మేము అంటూ రంగురంగుల సీతాకోక చిలుకలు సందడి చేస్తున్నాయి. మకరందం కోసం అటూ ఇటూ చెట్టు కొమ్మలపై తిరుగుతూ పుష్పాలను ముద్దాడుతూ కనువిందు చేస్తున్నాయి. మహానంది ఆలయ పరిసరాల్లో సోమవారం ఈ దృశ్యాలు కనిపించాయి. – మహానంది





ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలి

ఆత్మకూరు: రాష్ట్ర ప్రభుత్వం ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌ను కొనసాగించాలని కేవీపీఎస్ జిల్లా గౌరవాధ్యక్షుడు వి.యేసురత్నం, కారయదర్శి భాస్కర్, సహాయ కార్యదర్శి సంపత్, జిల్లా నాయకులు మునిపాటి చిన్నమారెన్న డిమాండ్ చేశారు. సోమవారం వారు విలేకరులతో మాట్లాడుతూ ఏ ప్రభుత్వం వచ్చినా ఎస్సీ, ఎస్టీలకు 200 యూనిట్ల లోపు ఉచిత విద్యుత్ ఇస్తామని వాగ్దానం చేస్తూ అమలు చేస్తున్నాయన్నారు. కొత్తగా వచ్చిన ప్రభుత్వం కూడా దీనిని కొనసాగించాలని కోరారు.

విత్తనాల పంపిణీ



రైతులకు విత్తనాలను పంపిణీ చేస్తున్న ఏడీఏ ఆంజనేయ, వంగాల శివరామిరెడ్డి

ఆత్మకూరు: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సోమవారం ఏడీఏ ఆంజనేయ ఆధ్వర్యంలో రైతులకు జీలుగ, గ్రామీణ విత్తన పథకంలో భాగంగా వరి, మినుము విత్తనాలను పంపిణీ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ త్వరలోనే సబ్సిడీపై మొక్కజొన్న, సూక్ష్మ పోషకాలైన జింక్, జిప్సం, బోరన్, ఆయిల్ ఇంజిన్లు, నీటిపైపులు, వ్యక్తిగత వ్యవసాయ పనిముట్లు సరఫరా చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. కార్యక్రమంలో ఏఓ విష్ణువర్ధన్ రెడ్డి, శ్రీశైలం మాజీ ట్రస్ట్‌బోర్డు చైర్మన్‌వంగాల శివరామిరెడ్డి, ఆత్మకూరు మాజీ సర్పంచ్ గోవిందరెడ్డి, మండల టీడీపీ అధ్యక్షుడు ప్రసాద్‌రెడ్డి, వేణుగోపాల్, మార్కెట్‌యార్డు చైర్మన్ తిరుపమయ్య తదితరులు పాల్గొన్నారు.

పల్లకీలో విహరించిన మహానందీశ్వరుడు



మహానందిలో పల్లకీసేవ పూజలు చేస్తున్న అర్చకులు, భక్తులు

మహానంది: మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి పల్లకీసేవ వైభవంగా జరిగింది. ఈఓ కాపు చంద్రశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో వేద పండితులు శాంతారం భట్, ఆంజనేయ శర్మ, ముఖ్య అర్చకులు రాఘవ శర్మ, అర్చకులు మహానందీశ్వర ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు. ముందుగా స్థానిక అలంకార మండపంలో గణపతి పూజ, అలంకార హారతులు చేసి స్వామి, అమ్మవార్లను పల్లకీలో కొలువు చేశారు. బలిహరణ పూజలు చేసిన అనంతరం ఆలయ ప్రాకారాల్లో స్వామివార్ల ఉత్సవం వైభవంగా జరిగింది.

టెలికాం వినియోగదారుల సదస్సు



వినియోగదారులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

శ్రీశైలంప్రాజెక్ట్: టెలికాం వినియోగదారుల సదస్సును స్పందన స్వచ్ఛంద సేవా సంస్థ సీఏజీ సభ్యుల పర్యవేక్షణలో సోమవారం సున్నిపెంటలోని కృష్ణవేణి కళ్యాణ మండపంలో నిర్వహించారు. టెలికాం రెగ్యులేటరీ ఆఫ్ ఇండియా సౌజన్యంతో కాగ్‌నెంబర్ ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. వినియోగదారులు, టెలికాం సర్వీస్ ప్రోవైడర్లు, స్థానికులు, టెలికాం అధికారులు ఈ కార్యక్రమంలో పాల్గొని వినియోగదారుల సమస్యలకు పరిష్కార మార్గాలను విశదీకరించారు. ముఖ్యంగా అనవసరమైన (అవాంచిత) కాల్స్ వలన వినియోగదారులు, ముఖ్యంగా మహిళా వినియోగదారులు ఇబ్బందులు పడుతున్నట్లు ట్రాయ్ గుర్తించిందన్నారు. అటువంటి కాల్స్ రాకుండా చేయడం కోసం వినియోగదారులు 1909 నెంబర్‌కు కాల్ చేసి అవాంచిత కాల్ నెంబర్‌ను రెండు సంవత్సరాల వరకు బ్లాక్ చేయ వచ్చని చెప్పారు. సదస్సులో ట్రాయ్ సీఏజీ మెంబర్ బి.శారద, బీఎస్ఎన్ఎల్ జేటీఓ ఓ.వెంకటరమణ, స్పందన సంస్థ ప్రతినిధులు హరికృష్ణ, శివప్రసాద్, లక్ష్మీసుజాత తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టండి



కార్యదర్శులు, ఇంజనీరింగ్ అసిస్టెంట్లకు సూచనలిస్తున్న అధికారులు

జూపాడుబంగ్లా: గ్రామాల్లో పారిశుద్ధ్య చర్యలు చేపట్టడంతో పాటు తాగునీటి ట్యాంకులను వెంటనే శుభ్రం చేయించి క్లోరినేషన్ చేయించాలని ఎంపీడీఓ నూర్జహాన్, ఈఓపీఆర్డీ మధుమోహన చక్రవర్తి, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాగేంద్ర ఆదేశించారు. సోమవారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లతో సమావేశం నిర్వహించారు. వారు మాట్లాడుతూ గ్రామాల్లో సత్వరమే గ్రామాల్లోని తాగునీటి ట్యాంకులను శుభ్రం చేయించడంతో పాటు క్లోరినేషన్ చేయించాలన్నారు. రెండు, మూడు రోజులకో పర్యాయం తాగునీటి ట్యాంకులు, చేతి పంపుల వద్ద నీటి పరీక్షలు నిర్వహించి రిపోర్టులు ఎంపీడీఓ కార్యాలయంలో అందజేయాలని సూచించారు. ట్యాంకులకు మూతలు ఏర్పాటు చేయించాలని ఆదేశించారు. పైపులు లీకేజయితే వెంటనే మరమ్మతులు చేయించాలన్నారు. అలాగే గ్రామాల్లోని డ్రైనేజీ కాల్వలు శుభ్రం చేయించి తొలగించిన మురుగు, చెత్తాచెదారాన్ని దూరంగా తరలించాలన్నారు.

సమస్యలు పరిష్కరించుకోండి

జూపాడుబంగ్లా: ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించే ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో లిఖితపూర్వకంగా ప్రజలు వారి సమస్యలను తెలియజేస్తే సత్వరమే వాటిని పరిష్కరిస్తామని తహసీల్దార్ బాబూ రాజేంద్రప్రసాద్ తెలిపారు. సోమవారం జూపాడుబంగ్లా తహసీల్దార్ కార్యాలయంలో ప్రజా సమస్యలు–పరిష్కారవేదిక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలు వారి వ్యక్తిగత, భూపరమైన సమస్యలు, గ్రామాల్లోని సమస్యలు లిఖితపూర్వకంగా తమకు తెలియజేయాలన్నారు. ప్రతి సోమవారం తహసీల్దార్ కార్యాలయంలో జరిగే కార్యక్రమంలో అన్నిశాఖల అధికారులు తప్పనిసరిగా పాల్గొనాలని ఆదేశించారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులకు వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యాధికారి గోపాల్

ఆత్మకూరు: ప్రజలు సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలని బైర్లూటి పీహెచ్‌సీ వైద్యాధికారులు గోపాల్, పవన్‌కుమార్ సూచించారు. మండలంలోని నాగలూటి చెంచుగూడెంలో సోమవారం ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించారు. వారు మాట్లాడుతూ గూడేల్లో సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు ప్రజలు ప్రధానంగా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. వర్షాకాలం కావడంతో డయేరియా, డెంగీ లాంటి విషజ్వరాలు ప్రబలే ప్రమాదం ఉందన్నారు. ప్రజలు తప్పనిసరిగా తాగునీటిని కాచి వడబోసి తాగాలని, గూడెంలోని ట్యాంకులను వారానికి ఒకసారి శుభ్రపరచాలని సూచించారు. గూడెంలోని గర్భిణులు ప్రధానంగా ప్రతివారం బీపీ, షుగర్, బరువు వంటి పరీక్షలు చేయించుకోవాలన్నారు. ఏమైనా సమస్యలుంటే బైర్లూటీ పీహెచ్‌సీకి రావాలని సూచించారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్ రమణమ్మ, సీహెచ్‌ఓలు, ఆరోగ్య, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.



విద్యార్థులకు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎస్.ఎన్.తండా సర్పంచ్ నాగులునాయక్

ఉన్నత చదువులు అభ్యసించాలి

ఆత్మకూరు: విద్యార్థులు ఉన్నత చదువులు అభ్యసించాలని ఎస్.ఎన్.తండా సర్పంచ్ నాగులునాయక్ అన్నారు. మండలంలోని ఎస్.ఎన్.తండా గ్రామంలో సోమవారం విద్యార్థులతో పలకలు, పెన్సిళ్లను పంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ తమ తండాకు చెందిన విద్యార్థులు ఉన్నత చదువులు చదివి ఉన్నత ఉద్యోగాలు పొందాలని, తల్లిదండ్రుల ఆశయాలను వమ్ము చేయకుండా ఉన్నత స్థాయికి ఎదగాలన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు శివశంకర్ నాయక్, వెంకటేశ్వరనాయక్, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.